ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 17 ఏప్రిల్ 2025

జడ్పీ పనులకు మోకాలడ్డు

అధికారులపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు ఒత్తిడి తెస్తున్నారు

- జడ్పీ సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజం
- పోడియంను చుట్టుముట్టి నిరసన
- పనులు జరిగేటట్టు చూస్తానని కలెక్టర్ విజయకృష్ణన్ హామీ
- ప్రమాదాల మృతులకు ఒకే తరహాలో ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఎమ్మెల్యే బండారు ప్రతిపాదనకు సమావేశం ఆమోదం
- ఔషధ దుకాణాల్లో కాలంతీరిన మందులు అమ్ముతున్నారు
- పరవాడ ఫార్మా సిటీ నుంచి విషవాయువులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య నిపుణుల కొరత
- జలజీవన్ మిషన్ పనులపై గోప్యత ఎందుకు?
- జడ్పీ సమావేశంలో సమస్యలను లేవనెత్తిన సభ్యులు



'ఎలమంచిలి'లో జడ్పీ నిధుల వినియోగంపై పోడియం వద్ద నిరసన తెలియజేస్తున్న సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జిల్లా పరిషత్ నిధులతో చేపడుతున్న పనులకు లేని ఇబ్బంది ఎలమంచిలి నియోజకవర్గంలో వస్తున్నదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులు చేయనివ్వకుండా స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ధ్వజమెత్తారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖపై చర్చ జరిగినప్పుడు పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసి రాజు మాట్లాడుతూ, ఎలమంచిలి నియోజకవర్గంలో జడ్పీ నిధులతో పనులు జరగడంలేదని సహచర సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని దీనిపై చైర్‌పర్సన్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎలమంచిలి నియోజకవర్గంతోపాటు ఇతర మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చైర్‌పర్సన్ పోడియంను చుట్టుముట్టి నిరసనకు దిగారు. దీంతో చైర్‌పర్సన్ స్పందిస్తూ 'ఎలమంచిలి'లో నిధుల వ్యయంపై గతంలో ఒకసారి సభ్యులు ప్రస్తావించారని గుర్తుచేశారు. అప్పట్లో అధికారులకు ఆదేశాలు ఇచ్చినా.. ఇంత వరకు సమస్య పరిష్కారంకాలేదని అన్నారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, పనులు జరిగేటట్టు ఆదేశాలు ఇస్తానని హామీ ... మిగతా 6వ పేజీలో



జడ్పీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

ఐదో షెడ్యూల్‌లోకి మైదాన గిరిజన గ్రామాలు

అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకుని అనకాపల్లి జిల్లాలో వున్న గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చడానికి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అంగీకరించారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నుంచి వచ్చిన ఉత్తర్వుల కాపీని జడ్పీ చైర్‌పర్సన్‌కు, అనకాపల్లి కలెక్టర్‌కు అందజేశారు. దీనికి సంబంధించి జడ్పీ సమావేశంలో, పాడేరులో త్వరలో జరగనున్న ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో తీర్మానం చేయాలని సూచించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలిపారు.

బండారు X అనురాధ



మాట్లాడుతున్న బండారు సత్యనారాయణ మూర్తి

కె.కోటపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణంపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, స్థానిక జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పాఠశాలకు ప్రస్తుతం ప్రహరీ గోడ ఉండగా, లోపలకు 10 అడుగుల దూరంలో మరో గోడ ఎందుకు నిర్మిస్తున్నారని అనురాధ ప్రశ్నించారు. దీనిపై సమగ్ర శిక్ష అధికారులు వివరణ ఇస్తుండగా.. ఆమె తన వాదనను కొనసాగించడంతో బండారు జోక్యం చేసుకున్నారు. మెయిన్‌రోడ్డును విస్తరించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా లోపల నుంచి ప్రహరీగోడ నిర్మించాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ తీర్మానించిందన్నారు. మళ్లీ అనురాధ మాట్లాడుతూ, మెయిన్‌రోడ్డును ఆనుకుని పాఠశాల స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు కుట్ర జరుగుతున్నదని ఆరోపించగా.. బండారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం కబ్జాలను సహించేది లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కబ్జాలకు పాల్పడిన వ్యక్తులపై ఇప్పుడు విచారణ జరుగుతున్నదని అన్నారు.



మాట్లాడుతున్న రాజు

చోడవరం ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చేపట్టిన పలు నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదని, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయాలని కోరారు. ఏయే పథకాల కింద ఎన్ని పనులు అసంపూర్తిగా వున్నాయి? వాటిని పూర్తిచేయడానికి ఎన్ని నిధులు అవసరం? వంటి వివరాలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఇందుకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

మరో ఇద్దరికి మార్కెట్ పదవులు

- అనకాపల్లి ఏఎంసీ చైర్మన్‌గా పచ్చికూర రాము
- మాడుగులకు పుప్పాల అప్పలరాజు..
- విధేయతకు పట్టంకట్టిన టీడీపీ అధిష్ఠానం



పచ్చికూర రాము, అనకాపల్లి



పుప్పాల అప్పలరాజు, మాడుగుల

అనకాపల్లి టౌన్/ మాడుగుల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో మరో రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈసారి రెండు పదవులనూ టీడీపీ నాయకులకు కట్టబెట్టింది. అనకాపల్లి ఏఎంసీ (ఎన్టీఆర్ మార్కెట్ యార్డు) చైర్మన్‌గా అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పచ్చికూర రాము, మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాడుగుల గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పుప్పాల అప్పలరాజు నియమితులయ్యారు.**

పచ్చికూర రాము తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీలో వున్నారు. పార్టీ మండల అధ్యక్షునిగా మూడు దఫాలు, తెలుగు రైతు అధ్యక్షునిగా, జిల్లా విద్యా కమిటీ సభ్యునిగా పనిచేశారు. కూండ్రం పంచాయతీ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా వుండడానికి రాము కృషే కారణం. ఆయన కుమార్తె సేనాపతి స్వరూపను 2013లో పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించి ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దారు.

మాడుగుల ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పుప్పాల అప్పలరాజు 1989లో సాధారణ కార్యకర్తగా టీడీపీలో చేరారు. సుమారు 18 సంవత్సరాలపాటు పార్టీ మండల అధ్యక్షునిగా సేవలు అందించారు. 1995 నుంచి 2000 వరకు మాడుగుల ఎంపీపీగా పనిచేశారు. సీడీసీ చైర్మన్‌గా రెండుసార్లు ఎంపికయ్యారు. టీడీపీ జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం మాడుగుల మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. వివాదరహితుడైన అప్పలరాజు.. టీడీపీ అధికారంలో వున్నా, లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుంటారు. అప్పలరాజు భార్య సరోజని గతంలో జడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేశారు.

దీపం-2 రెండో ఉచిత సిలిండర్‌కు బుకింగ్ ప్రారంభం

అనకాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైందని జేసీ జాహ్నవి తెలిపారు. జూలై ఒకటో తేదీ వరకు సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో అక్టోబరు 29 నుంచి మార్చి 31 వరకు తొలివిడత ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న వారి బ్యాంకు ఖాతాల్లో రూ.24,79,82,364 జమ అయ్యాయని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తుందని అన్నారు. వినియోగదారులు నగదు చెల్లించి సిలిండరు తీసుకున్న 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లోకి ఆ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా టోల్ ఫ్రీ నంబరు 1967 లేదా ఆయిల్ కంపెనీల కాల్ సెంటర్ 1800 2333555 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని జేసీ పేర్కొన్నారు.

అండగా ఉంటాం

పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది







దాడి రామలక్ష్మి కుమార్తెకు, పురం పాప కుమార్తెకు, గుంపిన వేణుబాబు భార్యకు చెక్కులు అందజేస్తున్న మంత్రి అనిత

- బాణసంచా కేంద్రంలో పేలుడు మృతుల కుటుంబాలకు హోం మంత్రి అనిత భరోసా
- ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ

కోటవురట్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, వీరిలో ఆరుగురు కోటవురట్ల మండలానికి చెందిన వారు వున్నారు. కైలాసపట్నానికి చెందిన అప్పికొండ తాతబ్బాయి బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తుండడంతో అతనిపై కేసు నమోదైంది. దీంతో నిబంధనల ప్రకారం అతని కుటుంబానికి పరిహారం అందజేయలేదు. మిగిలిన బాధితులకు ఆయా గ్రామాల్లో వారి ఇళ్లకు వెళ్లి ఒక్కొక్కరికి రూ.15 లక్షల చొప్పున చెక్కులు అందించారు. కైలాసపట్నంలో పురం పాప కుమార్తెకు, గుంపిన వేణుబాబు భార్యకు, సంగరాతి గోవింద భార్యకు, చౌడువాడలో సేనాపతి బాబురావు భార్యకు, రాజుపేటలో దాడి రామలక్ష్మి కుమార్తెకు ఎక్స్‌గ్రేషియా అందజేశారు. ఆయా మృతుల చిత్రపటాల వద్ద మంత్రి పుష్పాంజలి ఘటించారు. తమ చదువుల కోసం నాన్న బాణసంచా కేంద్రంలో పనికి వెళుతూ మృతిచెందాడని, ఇప్పుడు ఆయన లేకపోవడంతో ఎలా చదువుకోవాలో అర్థం కావడం లేదని సంగరాతి గోవింద కుమారుడు మహేశ్, కుమార్తె లహరీ వాపోయారు. దీంతో మంత్రి అనిత స్పందిస్తూ.. మీ చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. తమ కుటుంబం గడవడానికి ఏదైనా ఉపాధి చూపించాలని గుంపిన వేణుబాబు భార్య దేవి విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలో ఆయాగా అయినా పనిచేస్తానని ఆమె కోరుతూ కంటతడి పెట్టుకున్నారు. అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ఎక్కడ ఖాళీ వుంటే అక్కడ ఆయా పోస్టు ఇప్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

పకడ్బందీగా చందనోత్సవం

గత తప్పిదాలు పునరావృతం కాకూడదు

- దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- క్యూఆర్‌కోడ్, హోలోగ్రామ్‌తో టికెట్లు, పాస్‌ల జారీ: కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- సింహాచలంలో అప్పన్న చందనోత్సవంపై సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, నగర సీపీ శంఖబ్రత బాగ్చి.

వేపగుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సామాన్య భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సింహాచలం గోశాల సమీప శ్రీనివాసనగర్‌లోని దేవస్థానం నూతన కల్యాణ మండపంలో బుధవారం చందనోత్సవ ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఉన్నత సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మికాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెల్లవారుజామున ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు దర్శనం అనంతరం మూడు గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అదే సమయంలో వీవీఐపీలు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉదయం 5 గంటల్లోగానే అంతరాలయాల దర్శనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి భక్తుడు దర్శనం చేసుకుని, బయటకు రాగానే పులిహోర, దద్దోజనం, లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించాలని, నిత్యాన్నదానం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ వీవీఐపీ, ప్రొటోకాల్ టికెట్ల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించేందుకు రూ.1,500 టిక్కెట్లను కేవలం 2,500 మాత్రమే ముద్రించామన్నారు. వాటిలో క్యూఆర్ కోడ్, హోలోగ్రామ్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ కొండపైకి ఎక్కువ వాహనాలను అనుమతించకూడదని, వీఐపీతో పాటు వచ్చే కుటుంబసభ్యుల్లో ఆరుగురిని మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్, వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ క్యూలైన్ పరిధి పెంచడంతో పాటు సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించాలన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రూ.1,500 నకిలీ టికెట్లు చలామణీ అయ్యాయని, అధికారులు ... మిగతా 6వ పేజీలో

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి స్వాధీనం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో కోటవురట్ల మండలంలో ఆరు, నర్సీపట్నం, మాకవరపాలెం, కశింకోట మండలాల్లో మూడేసి, రోలుగుంట, బుచ్చెయ్యపేట, ఎలమంచిలి మండలాల్లో రెండేసి, ఎలమంచిలి మునిసిపాలిటీ, నాతవరం మండలాల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 23 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసులను దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం కోటవురట్ల మండలం రాజుపేట జంక్షన్ వద్ద ఆరుగురిని అరెస్టు చేశారు. వీరి నుంచి 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి, రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడంతో జువెనైల్ హోమ్‌కు, మిగిలిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభకనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహన్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్

- ఒకే ప్రాంతంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లల్లో చోరీలు
- 9.5 తులాల బంగారం, 42 తులాల వెండి అపహరణ



సింహాచలం ఇంట్లో పగలగొట్టిన బీరువా

నర్సీపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): **మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసి వున్న మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తొమ్మిదిన్నర తులాల బంగారం, 42 తులాల వెండి, కొంత నగదును అపహరించుకుపోయారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..**

పెదబొడ్డేపల్లి థెరెసా కాలనీలో ఎం.సింహాచలం, భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. సింహాచలం ఆరోగ్యం బాగోలేక పోవడంతో శనివారం అందరూ కలిసి విశాఖలో ఆస్పత్రికి వెళ్లారు. పై అంతస్థులో అద్దెకు ఉంటున్న గణేశ్ బుధవారం ఉదయం సింహాచలం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి అతని కుమారుడు సత్యసారథికి ఫోన్ చేశారు. వారు వెంటనే ఇంటికి తిరిగి వచ్చి చూడగా పడక గదిలోని బీరువా తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఏడు తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో ... మిగతా 6వ పేజీలో

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వెల్లడి » అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల ప్రజల నుంచి వినతుల స్వీకరణ



అచ్యుతాపురంలో జనసేనలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం/రాంబిల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. అచ్యుతాపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. వినతి పత్రాలు అందజేసినవారి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. ఇదిలావుంటే, మండలంలోని చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్ల దిబ్బ గ్రామాలకు చెందిన సుమారు రెండు వందల మంది వైసీపీ శ్రేణులు చిప్పాడ మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాస రావు, కరెడ్ల ప్రకాష్, రాజాన పైడి భాస్కరరావు, రాజాన నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలం హరిపురంలో గల జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుని వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాల శాఖల అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, బొద్దపు శ్రీనులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఎలమంచిలి సమీపం శేషుకొండ వద్ద డంపింగ్ యార్డు పరిశీలన

జనసేనలో పలువురిచేరిక

మునగపాక : జనసేనలో ప్రత్యేకంగా నాయకులంటూ ఎవరు ఉండరని, అంతా జనసైనికులేనని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం అరబుపాలెం, నారాయుడుపాలెం గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరిన సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అంతా కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే

ఎలమంచిలి : పట్టణ సమీపం శేషుకొండ వద్ద ఉన్న డంపింగ్ యార్డును బుధవారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారితో కలిసి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. అక్కడ పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి ఉండడాన్ని చూసి ఇంత పెద్ద ఎత్తున ఉన్న చెత్త తరలించకుండా ఎందుకు నిర్లక్ష్యంగా ఉంచారని అధికారులను ప్రశ్నించారు. డంపింగ్ యార్డుకు వచ్చే రోడ్డు మార్గం అసంపూర్తిగా ఉండడంతో చెత్త తరలించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజారోగ్య శాఖ అధికారి పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. శేషుకొండ సమీపంలో నివాసం ఉంటున్న పలువురు ఎమ్మెల్యేను కలిసి కాలనీలో సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఏఈ గణపతి సుబ్బారావు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి ఒకరి మృతి

చోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు సమీపంలో మురుగు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లికి చెందిన కడిమి ఏసు(38) చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను మురుగు కాలువలో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టానికి తరలించారు. మద్యం మత్తులో కాలువలో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా గత నెలలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కూడా ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు.

20న జిల్లా ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, ఆచార్య చెస్ అకాడమీ సంయుక్తంగా ఈ నెల 20న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-7 బాలుర, బాలికల ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. నగరంలోని మాధవదార గాయత్రి విద్యామందిర్ వేదికగా జరిగే ఈ టోర్నీలో పాల్గొనే చిన్నారులు జనవరి ఒకటి, 2018న లేదా ఆ తర్వాత పుట్టినవారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల చిన్నారులు ఈ నెల 19న మధ్యాహ్నం 12 గంటల్లోపు ఫోన్: 80744 80434, 98493 71760 నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పకడ్బందీగా చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

దృష్టి పెట్టాలన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పుసపాటి అశోకగజపతిరాజు మాట్లాడుతూ సామన్య భక్తులకు సత్వరం దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, దేవదాయ శాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, సింహాచలం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన



గ్యాస్ ప్రమాదాల నివారణపై గృహిణికి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై పట్టణంలోని పలు అపార్టుమెంట్ల వాసులకు బుధవారం ఎలమంచిలి అగ్ని మాపక అధికారి రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. ఇళ్లలో గ్యాస్ స్టౌ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపాలని, పాడైన గ్యాస్ ట్యూబ్‌లను వెం టనే మార్చాలని సూచించారు ప్రధానంగా వంట గదిలో అదనపు గ్యాస్ సిలెండర్ ఉంచరాదన్నారు. అలాగే, విద్యుత్ పరికరాల వాడకం సమయాల్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సమస్యలపై 'ఉపాధి హామీ' క్షేత్ర సహాయకుల వినతి

మునగపాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వాహణలో తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నామని ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు వాపోయారు. ఈ మేరకు బుధవారం ఇక్కడ ఎంపీడీవో ఎం.ఉషారాణిని కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం సభ్యుడు దొడ్డి గోవింద మాట్లాడుతూ 19 సంవత్సరాలు సర్వీసు నిండిన వారిని గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని విన్నవించారు. అలాగే, వేతనాలు పెంచాలని కోరారు. డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

'రాష్ట్రంలో 29 నాటక సమాజాలున్న ఏకైక గ్రామం మునగపాక'

మునగపాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 29 నాటక సమాజాలు ఉన్న ఏకైక గ్రామం మునగపాక అని గ్రామీణ యువజన మందిరం గౌరవాధ్యక్షులు సూరిశెట్టి రాము, పెంటకోట సీతారామ్ అన్నారు. బుధవారం ఇక్కడ తెలుగు నాటరంగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువగా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే నాటక పరిషత్ జరుగుతూ ఉంటాయని, గ్రామ స్థాయిలో కూడా పరిషత్ నిర్వహించే ఘనత గ్రామీణ యువజన మందిరానికే దక్కుతుందన్నారు. అనంతరం మునగపాక గ్రామానికి చెందిన నాటక రచయితలు దాడి జగన్నాథరావు, విల్లూరి జగ్గఅప్పారావు, ఆడారి శేఖర్‌లను యువజన మందిరం, గౌరీయూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రంగస్థల దర్శకులు, నటులు దాడి మునిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, మళ్ల సంజీవరావు, ఆడారి సూర్యచంద్రరామారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి గణపతి అచ్చింనాయుడు, ఆడారి కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.



రచయితలను సత్కరించిన యువజన మందిరం సభ్యులు

'అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు వద్దు.. నగదే ఇవ్వాలి'

అచ్యుతాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు వద్దని, నగదునే పరిహారం కింద ఇవ్వాలని జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, జడ్పీటీసీ సభ్యుడు లాలం రాము బుధవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కోరారు. ఈ మేరకు విశాఖలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆమెను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే అచ్యుతాపురం మండలంలోని సాని కాలువ - తమ్మయ్యపేట, గండివానిపాలెం- కొల్లివానిపాలెం పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణాలు సగంలో నిలిచిపోయాయన్నారు. అదేవిధంగా బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసితులైన దొప్పెర్ల, రావిపాలెం వాసులకు ఎకరాకు రూ.60 లక్షల పరిహారం చెల్లించాలని విన్నవించారు. పంచాయతీ కార్మికులకు ప్రతినెలా చెల్లించాలని, ఇనాం భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

రాంబిల్లి మండలంలో భారీ వర్షం

రాంబిల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. అనంతరం ఉరుములు, మెరుపులు, గాలులతో సుమారు గంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. అంతటా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది.

నేడు కొత్తపట్నంలో నూకాంబిక జాతర

రాంబిల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకార గ్రామమైన కొత్తపట్నంలో గురువారం నూకాంబిక అమ్మవారి జాతర ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు.

పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్

... 5వ పేజీ తరువాయి

చోరీ జరిగినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదే వీధిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బత్తిన సత్యనారాయణ నివాసం వుంటున్నారు. ప్రస్తుతం రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీలో పనిచేస్తున్నారు. వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెళుతుంటారు. ఆయన భార్య భవానీ శనివారం అత్తవారి ఊరైన కోటవురట్ల మండలం పందూరులో పండక్కి వెళ్లారు. బుధవారం ఉదయం తలుపులు తెరిచి ఉండడాన్ని ఎదురింటావిడ గమనించి భవానీకి సమాచారం ఇచ్చారు. ఆమెకు దగ్గర బంధువు నాగేశ్వరరావు 100కు ఫిర్యాదు చేయగా. పోలీసులు వచ్చి విచారణ చేశారు. రెండున్నర తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితులు చెప్పారు.



రామకృష్ణ ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పెదబొడ్డేపల్లి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న రామ్‌నగర్ కాలనీలో వైజాగ్ ఎయిర్ పోర్టులో సెక్యూరిటీ విభాగంలో ఎస్ఐ కేడర్ అధికారిగా పని చేస్తున్న అడిగర్ల శ్రీరామమూర్తి నివాసం వుంటున్నారు. అయితే ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో వుంటూ వారానికి ఒక రోజు భార్యాభర్తలు ఇక్కడకు వచ్చి ఇల్లు శుభ్రం చేసుకొని వెళుతుంటారు. ఇది గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీరామమూర్తి కుమారుడు ప్రసాద్.. ఇంట్లో దుస్తులు చెల్లాచెదురుగా ఉండడాన్ని సీసీ కెమెరాలకు అనుసంధానం చేసిన సెల్ ఫోన్ ద్వారా చూసి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి 10 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. క్లూస్ టీమ్‌లు వేలి ముద్రలు సేకరించాయి. థెరెసా కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పేదల అభ్యున్నతే పీఎం ధ్యేయం'

ఎస్.రాయవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలపేద ప్రజలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పీఎం మోదీ పనిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీపతిరాజుపేటలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, మాజీ సర్పంచ్ శ్రీపతిరాజు, లీగల్ సెల్ కన్వీనర్ ధూళి నూకరాజు, నాయకులు సుందర్ రామరాజు, సేనాపతి సూర్యారావు, నూకయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడిపై దృష్టి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనపై విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కమిటీల ద్వారా ప్రత్యేక దృష్టిసారించామని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు చెప్పారు. ధర్మవరం అగ్రహారం గ్రామంలో బుధవారం 11 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్ మాణిక్యం, ఎంపీటీసీ సభ్యురాలు సియ్యాదుల వరహాలమ్మ మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపమాకలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

నక్కపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక జగనన్న కాలనీలో రక్షిత నీటి ట్యాంకు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కాలనీ వాసులు తాగునీరు అందుబాటు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి వచ్చింది. ఆమె ఆదేశాల మేరకు ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కార్యదర్శి జయ ప్రకాశ్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ట్యాంకు నిర్మాణం పూర్తయిన తరువాత ఉపమాకలో వున్న సంప్ నుంచి పైప్‌లైన్ ద్వారా జగనన్న కాలనీ ట్యాంకుకు మంచినీరు సరఫరా చేసేందుకు పైప్‌లైన్లు కూడా అమర్చుతామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పిశెట్టి శ్రీను, వాసు, తోలేటి శ్రీను, వరహాలరావు, బద్ది చక్రరావు, జి.సత్యనారాయణ, గొర్ల రవి, యలమంచిలి రమణబాబు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

నక్కపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి మహిళా సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్థికంగా ఎదగడానికి రూపొందించాల్సిన ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు లింకేజీ డీపీఎం కుమారస్వామి, ఫైనాన్స్ డీపీఎం శ్రీనివాస్, స్త్రీనిధి ఏజీఎం శ్రీనివాస్, సీసీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలపై ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎఫ్ఏలు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఆందోళనకు దిగారు. పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని వారు నినాదాలు చేశారు. లేనిపక్షంలో పోరాటమే శరణ్యమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 28 నుంచి విధులు బహిష్కరించి సమ్మెకు దిగుతామని తెలిపారు. అనంతరం ఎంపీడీవో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.విజయ్‌కుమార్, టి.వీరబాబు, ఎం.అప్పలరాజు, కె.దుర్గారావు, కె.సత్యనారాయణ, వివిధ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఉపాధి కోసం ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని డీఎల్‌పురం, బోయపాడు గ్రామాల్లో నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై తహసీల్దార్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆర్డీవో వీవీ.రమణ హాజరయ్యారు. ప్రభుత్వ పరంగా గృహాలు కోల్పోయిన వారికి అందించే పరిహారాన్ని ఆర్డీవో వివరించారు. నిర్వాసిత రైతుల సమస్యలను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, డీఎల్‌పురం సర్పంచ్ కిల్లాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కనకారావు, మాజీ సర్పంచ్ జి.లక్ష్మణరావు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు.

గీత కార్మిక కుటుంబానికి జన సైనికుల చేయూత

నక్కపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గీత కార్మికుడు దొంగల శ్రీనుకు జన సైనికులు చేయూతనందించారు. శ్రీను తాటిచెట్టుపై నుంచి పడిపోవడంతో వెన్నుముకకు దెబ్బతగిలి ఇంటి వద్దే కదల్లేని పరిస్థితుల్లో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్.రాయవరం మండలం జనసేన నేత శానాపతి బాబూరావు ఆధ్వర్యంలో సింగపూర్ సురేశ్, నెదర్లాండ్స్ గ్రూప్ సభ్యులు, తిమ్మాపురం టెన్త్ పూర్వ విద్యార్థులు కలిపి రూ.61 వేలు సేకరించి బుధవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ప్రసాదుల గణేశ్, జనసేన నాయకులు గట్టెం నానాజీ, వి.సుధాకర్, ఎ.లోవరాజు, కె.అప్పలరాజు, జి.ధన, కె.రాము, కె.దుర్గాప్రసాద్, జి.సురేశ్, టి.చందు, చంద్రరావు, బి.రాజు, డి.రాజు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జనం ఉపశమనం

పాయకరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడు ప్రతాపానికి అల్లాడిన ప్రజలు రాత్రి పడిన వర్షానికి వాతావరణం చల్లపడ్డంతో ఉపశమనం పొందారు. ప్రస్తుత ఎండాకాలంలో పాయకరావుపేటలో రోజూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడి ప్రజలు సేదతీరారు. అయితే లోతట్టు ప్రాంతాలు జలమయంకాగా, మెయిన్‌రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కోటవురట్లలో...



కోటవురట్ల రహదారిపై కురుస్తున్న వర్షం

కోటవురట్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండకు ఉక్కపోతతో సతమతమైన ప్రజలు, మధ్యాహ్నం ఉరుములతో సుమారు గంటపాటు పడిన వర్షానికి ఉపశమనం పొందారు. ఈ వర్షం వేసవిలో సాగు చేస్తున్న పంటలకు ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'టాటా' పీహెచ్‌డీకి లక్ష్మీప్రహర్ష ఎంపిక



లక్ష్మీప్రహర్ష

పాయకరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ పీహెచ్‌డీకి పాయకరావుపేటకు చెందిన కొసిరెడ్డి లక్ష్మీప్రహర్ష ఎంపికైంది. బుధవారం ఆమె తండ్రి డాక్టర్ కె.వీరాజు ఈ వివరాలను వెల్లడించారు. గతేడాది డిసెంబరు 8న జాతీయ స్థాయిలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో తమ కుమార్తె ప్రథమ శ్రేణి సాధించి జాతీయ స్థాయిలో ఇంటర్వ్యూలకు ఎంపికైన 150 మందిలో స్థానం సాధించిందన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(ముంబై)కు మార్చి 5, 6 తేదీల్లో జరిగిన సెకండ్ లెవెల్ ఇంటర్వ్యూల్లో 36 మంది ఎంపికకాగా, ఏపీ నుంచి తమ కుమార్తె డిపార్టుమెంట్ ఆఫ్ ఎస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేయడానికి ఎంపికైందన్నారు. ఫిజిక్స్ విభాగంలో రీసెర్చ్ చేసి సైంటిస్ట్‌గా స్థిరపడాలని తన కుమార్తె ఆకాంక్ష అని ఆయన తెలిపారు. కాగా పీహెచ్‌డీకి ఎంపికైన లక్ష్మీప్రహర్షకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్‌తో పాటు పట్టణ ప్రముఖులు ధనిశెట్టి బాబూరావు, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ళ వరహాలు, గూటూరు శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

రైతులకు రీ సర్వే నోటీసులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో రైతులకు తసీల్దార్ జి.సత్యనారాయణ బుధవారం రీ సర్వేకు సంబంధించి నోటీసులను జారీచేశారు. తమ పొలం సర్వే పూర్తయిందా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అన్నది తెలియజేయాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. రైతుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా స్వీకరిస్తామని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజేంద్రప్రసాద్, మండల సర్వేయర్ శ్రీనివాస్, సచివాలయ సర్వేయర్, వీఆర్వో పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

నక్కపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణను జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. టీడీపీ ఏర్పడినప్పటి నుంచి ఒకే పార్టీలో ఉన్న దేవరకు ఏఎంసీ చైర్మన్ పదవి లభించడం పట్ల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బర్నికాన బాబూరావు, ప్రధాన కార్యదర్శులు సబ్బి శ్రీనివాస్ యాదవ్, కరక సోమునాయుడు, సభ్యులు నరసింహమూర్తి, పంచదార్ల సూరిబాబు, వియ్యపు చిన్న, సారిపల్లి జోగినాయుడు, సింహాచలం, అప్పలరాజు తదితరులు దేవర సత్యనారాయణను గజమాలతో సత్కరించారు.

విద్యార్థులకు స్కౌట్ శిక్షణ సర్టిఫికెట్లు

పాయకరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ ప్రవేశ శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు బుధవారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. 6, 7, 8 తరగతులకు చెందిన 44 మంది విద్యార్థులకు ఇన్‌చార్జి హెచ్ఎం ఎంఎస్ఎస్ వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రమాదేవి, స్కౌట్ మాస్టర్ ఆర్.రమేశ్, గైడ్ కెప్టెన్ కె.రత్నమ్మ పాల్గొన్నారు.

జడ్పీ పనులకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. దీంతో సభ్యులు శాంతించారు. సమావేశం ప్రారంభంకాగానే కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు పాటించనందునే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అన్ని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దారు, ఎస్ఐ, ఎంపీడీవోల నేతృత్వంలోని కమిటీ ప్రతి నెల తనిఖీచేస్తే భవిష్యత్తులో ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. బాణసంచా ప్రమాదంతోపాటు ఫార్మా, ఇతర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు చెల్లించే పరిహారంలో వ్యత్యాసం వుంటున్నదని, దీంతో తగిన నష్టపరిహారం కోసం ఫార్మా కంపెనీల వద్ద బాధిత కుటుంబాలు ధర్నాలు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు ఒకే విధమైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం ఒక విధానం రూపొందించాలని కోరుతూ జడ్పీ తీర్మానం చేయాలని కోరారు. ఇందుకు సమావేశం ఆమోదించింది. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, పరవాడ ఫార్మాసిటీలోని పలు కంపెనీల నుంచి విడుదలయ్యే విషవాయువులతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని నివారించడానికి ఆయా కంపెనీలు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

వైద్య, ఆరోగ్య శాఖపైలో జరిగిన చర్చలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఎక్కువగా ఉందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో గైనిక్, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వైద్యులను తక్షణమే నియమించాలని, అన్ని సీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే బండారుతోపాటు కోటవురట్ల, చింతపల్లి, పెదబయలు జడ్పీటీసీ సభ్యులు సిద్ధాబత్తుల ఉమాదేవి, పోతుల బాలయ్య, బొంజిబాబు కోరారు. అనంతగిరి మండలంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఎస్.కోటలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కాకుండా విజయనగరం తీసుకెళుతున్నారని, దీనివల్ల మెరుగైన వైద్యం అందడంలేదని జడ్పీటీసీ సభ్యుడు డి. గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా జేసీ అభిషేక్ గౌడ స్పందిస్తూ.. సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనకాపల్లి జిల్లాలో మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేదని, కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నారని, దీనిపై ఫిర్యాదుచేసినా ఎవరు పట్టించుకోవడంలేదని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆరోపించారు. ఎమ్మెల్యే బండారు జోక్యంచేసుకుని... ఉమ్మడి జిల్లాలో అన్ని మందుల దుకాణాలను తనిఖీచేసి వచ్చే సమావేశంలో ఒక నివేదిక అందజేయాలని కోరారు.

అంతకుముందు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు శివానంద్ మాట్లాడుతూ, కేజీహెచ్‌లో వారం రోజులపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మార్చురీ గది వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో వడదెబ్బకు గురైన వారికి చికత్స అందించడం కోసం ఆరు బెడ్లతో ఉన్న ఏసీ గదిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా ఓపీ కౌంట్లు ఓపెన్ చేశామని చెప్పారు.

జలజీవన్ మిషన్ పనులపై గోప్యంత ఎందుకు?

జిల్లాలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులపై గోప్యత ఎందుకని, కనీసం సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వడంలేదని ఛైర్‌పర్సన్ సుభద్ర మండిపడ్డారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు సర్పంచ్‌కు చెప్పకపోతే ఎలా అని అధికారులను నిలదీశారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ పనుల్లో లోపాలు ఉన్నాయని, చాలాచోట్ల నీరు రావడంలేదని అన్నారు. దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చౌదరి హామీ ఇచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం నీటి పథకాలు, బోర్లుకు మరమ్మతులు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అరకులోయ ఎంపీ తనూజరాణి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, 'సామాజిక' కార్పొరేషన్ల ఛైర్మన్లు పీవీజీ. కుమార్, మళ్ల సురేంద్ర, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ

హుండీ ఆదాయం రూ.41.51లక్షలు



ఆలయం ఆవరణలో హుండీని లెక్కిస్తున్న శ్రీవారి సేవా సభ్యులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వసంతకుమార్, పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు, కూటమి నాయకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు భక్తుల ముడుపులు, మొక్కుబడుల ద్వారా రూ.41,51,973ల ఆదాయం లభించింది. అలాగే, బంగారం 15 గ్రాముల 500 మిల్లీగ్రాముల, వెండి 700 గ్రాములు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ పీలా నాగశ్రీను, ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, కాండ్రేగుల రాజారావు, కోనేటి సూర్యలక్ష్మి, వడ్డాది మంగ, యర్రవరపు లక్ష్మి, ఆలయ సిబ్బంది, శ్రీవారి సేవా సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడి గ్రామం తరలించాలని ఆందోళన



గ్రామాన్ని తరలించాలని నినాదాలు చేస్తున్న నాయకులు

పరవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తాడి బీసీ కాలనీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫార్మా కాలుష్యంతో గ్రామస్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోయారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో తాగునీరు కొనుక్కోవలసి వస్తుందన్నారు. గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కండేపల్లి అప్పలరాజు, పితాని సన్యాసిరావు, కె.పెంటయ్య, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రింగు రోడ్డులో చెత్త తొలగించాలి ధర్నా



రింగురోడ్డులో ధర్నా చేస్తున్న వాకర్స్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రింగు రోడ్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తూ వాకర్స్ బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు కొణతాల హరినాథబాబు మాట్లాడుతూ బెల్లం మార్కెట్ వద్ద గల ఖాళీ ప్రదేశాల్లో గృహ నిర్మాణాల వ్యర్థాలను పలువురు రాత్రి వేళల్లో తెచ్చి పారబోస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా దారిపొడువునా మట్టి, చెత్త పేరుకుపోతోందన్నారు. జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వృథా మట్టి, చెత్త, గృహ నిర్మాణాల వ్యర్థాలను పారబోస్తున్న వారిని గుర్తించి చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి'



కార్యకర్తలతో మాట్లాడుతున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లి ప్రచారం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పిలుపునిచ్చారు. లక్ష్మీనారాయణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో ఏర్పాటైన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు. నాయకులు పాకలపాటి రాజబాబు, దాడి ఈశ్వరరావు, శిలపరశెట్టి బాబీ, వేగి దొరబాబు, గొంతిన లోవ అప్పారావు, రేబాక మధుబాబు పాల్గొన్నారు.

జాజులవానిపాలెం సమీపంలో కారు బీభత్సం

- కొరియర్ వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొని పరారీ
- ముగ్గురికి గాయాలు
- భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్
- వెంబడించి కారును పట్టుకున్న స్థానికులు



కారు ఢీకొనగంతో బోల్తాపడిన కొరియర్ వ్యాన్



దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు వరకు నిలిచిపోయిన వాహనాలు

పరవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కొరియర్ వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టి పరారైన సంఘటన బుధవారం సాయంత్రం గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారిలోని జాజులవానిపాలెం సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు కొరియర్ వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. ఈ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. జాజులవానిపాలెం సమీపంలో గల కొరియర్ ఆఫీస్ నుంచి వ్యాన్ గాజువాక వైపు బయల్దేరింది. వ్యాన్ వెనుకను మరొక ద్విచక్ర వాహనం వెళ్తుంది. అదే రహదారిలో గాజువాక నుంచి పరవాడ వైపు వస్తున్న కారు తొలుత కొరియర్ వ్యాన్‌ను, ఆ తర్వాత ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పరారైంది. ప్రమాద ధాటికి కొరియర్ వ్యాన్ బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ జానకిరామ్, క్లీనర్ బోసు రాజులకు స్వల్ప గాయాలయ్యాయి. వ్యాన్‌లో చిక్కుకున్న వారిని స్థానికులు బయటకు తీశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు వరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, మహిళా ఎస్‌ఐ మహాలక్ష్మి సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రహదారిపై బోల్తాపడిన వ్యాన్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా ఈ ప్రమాదంలో గాయపడిన ద్విచక్ర వాహనచోదకుడి వివరాలు తెలియరాలేదు. ప్రమాదానికి కారణమైన కారును స్థానికులు ఓ ప్రైవేట్ స్కూల్ సమీపంలో పట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటనారాయణ

కొత్తూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. సైబర్ క్రైం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.జయబాబు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు టోపీలు వితరణ



పోలీసులకు టోపీలు, అద్దాలు అందజేసిన వాసవి క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ట్రాఫిక్ పోలీసులకు బుధవారం పలు సంస్థలు టోపీలు, కూలింగ్ కంటి అద్దాలను వితరణగా అందజేశారు. వాసవీ క్లబ్, కెమిస్ట్ అసోసియేషన్ సహకారంతో టోపీలు, సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్, రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆస్పత్రి సహకారంతో కూలింగ్ అద్దాలను సీఐ ఎం.వెంకటనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శివ, పూసర్ల రాజా, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భద్రతా నిబంధనలు పాటించాలి

- ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ప్రసాద్

కొత్తూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ పరిధిలో ఉన్న కాంట్రాక్టు సిబ్బంది భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ సూచించారు. కొత్తూరులోని కల్యాణ మండపంలో బుధవారం కాంట్రాక్టర్లు, సిబ్బందికి ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని గీతాంజలి అపార్టుమెంట్‌లో నివాసితులకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒక వేళ ప్రమాదం జరిగితే నివారణకు తీసుకోవాల్సిన చర్యలను అగ్నిమాపక శాఖాధికారి నాగేశ్వరరావు వివరించారు. అలాగే, గ్యాస్ స్టౌకు మంటలు వ్యాపించినప్పుడు ఆ మంటలను ఏ విధంగా నివారించాలో డెమో ప్రదర్శించారు. అనంతరం కరపత్రాలను అపార్టుమెంట్ వాసులకు పంచిపెట్టారు.

సబ్బవరంలో...

సబ్బవరం : మహిళలు గ్యాస్‌పై వంట చేసేటప్పుడు, విద్యుత్ పరికరాలు వాడినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ఫైర్ ఆఫీసర్ జీవీ సత్యరాజ్ సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సబ్బవరంలోని సాయినగర్ కాలనీలో అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురు మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఏ విధంగా అదుపు చేయాలో డెమో ద్వారా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలతో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందిస్తున్న సహాయకులు

సబ్బవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల సంఘం ప్రతినిధులు బుధవారం ఎంపీడీవో పి.పద్మజకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆర్.సన్యాసిరావు, పి.సంతోషి, డి.రామకృష్ణ మాట్లాడుతూ తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించకుంటే ఈనెల 21వ తేదీన ఒక రోజు విధులు నిలిపివేసి, పెన్‌డౌన్ చేపడతామన్నారు. 28న విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సంబంధిత శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు దాసరి రామకృష్ణ, ఆర్.శిరీష, పి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

- ఇద్దరికి గాయాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలోని కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయని ట్రాఫిక్ ఎస్‌ఐ శేఖరం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన పరిటి ప్రసాదరావు(60), ఆయన భార్య లక్ష్మి ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి కొత్తూరు వైపు వస్తుండగా ఉమ్మలాడ వైపు నుంచి కొత్తూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ప్రసాదరావు, ఆయన భార్య లక్ష్మి, ద్విచక్ర వాహనచోదకుడు బుద్ద అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అప్పటికే ప్రసాదరావు మృతి చెందాడని ట్రాఫిక్ ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. మిగిలిన ఇద్దరికీ ఎటువంటి ప్రాణహాని లేదని తెలిపారు.

నేడు దుర్గమాంబ పండుగ



పరవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కలపాక పంచాయతీ మూలస్వయంభూవరం ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండుగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభం కానున్నాయి. రాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అమృతపురంలో బంగారుతల్లి అనుపోత్సవం

సబ్బవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : అమృతపురంలో బంగారుతల్లి అమ్మవారి అనుపోత్సవం గురువారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టామన్నారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సాయంత్రం కోలాటాలు, చిడతల భజనలు, సాముగరడీ, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి ఊరేగింపు, అనుపోత్సవం జరుపుతామన్నారు.

చెరువు గట్టుపై కుళ్లిన చేపలు

- రాకపోకలు సాగిస్తున్న వారికి దుర్వాసనతో ఇబ్బందులు
- వ్యాపారాలు సాగడం లేదని పలువురు ఆవేదన



చెరువు గట్టుపై కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్న చేపలు

పరవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గాజువాక- ఎలమంచిలి ప్రధాన రహదారిలోని స్థానిక టీ రాజా హోటల్‌కు ఎదురుగా ఉన్న చెరువు గట్టుపై గల చేపలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల చెరువు క్లీనింగ్ పనుల నిమిత్తం అందులో ఉన్న చేపలన్నింటినీ పట్టి గట్టుపై విడిచి పెట్టారు. అవి కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే రైతులతో పాటు స్థానికులు అవస్థలు పడాల్సి వస్తోంది. సమీపంలో గల దుకాణాల యాజమానులు సైతం గగ్గోలు పెడుతున్నారు. దుర్వాసన కారణంగా వ్యాపారాలు సరిగా సాగడం లేదని వాపోతున్నారు. గాలివీచే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చెబుతున్నారు. చేపలను అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక దల్లివారివీధిలో ఓ వ్యక్తి నుంచి బుధవారం పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. దల్లివారివీధికి చెందిన కాకర రామారావు మెయిన్‌రోడ్డులో మద్యం కొనుగోలు చేసి పట్టుకొని వెళుతుండగా హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి ఆయనను తనిఖీ చేశారు. అతని వద్ద 10 మద్యం బాటిళ్లు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

భాషా నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన

కశింకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి ఉన్నత పాఠశాలలో పోస్టు కార్డులపై కుశలమా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్యం, లేఖ రాసే విధానం, తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పించారు. అంతేగాకుండా మానవ సంబంధాలు పెంపు, పర్యావరణ పరిరక్షణపై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 110 మంది విద్యార్థులు ఉత్తరాలపై బొమ్మలు వేసి వివిధ ప్రాంతాలకు పోస్ట్ చేశారు. ఉపాధ్యాయులు సబిత లక్ష్మి, పి.సత్యనారాయణమూర్తి, ఎ.నూకరాజు, సత్యవాణి, విజయ్‌కుమార్, సోమరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కశింకోట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) :విస్సన్నపేటలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ అనకాపల్లి ప్రాజెక్టు అధికారిణి పి. ప్రభావతి హాజరై గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై వివరించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల అంగవైకల్యాన్ని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. పోషణ పదార్థాల స్టాళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బయ్యవరం సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.వంశీప్రియ, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మే ఒకటో తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ బుధవారం తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి పద్నాలుగేళ్ల వయస్సు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలు ఈ శిబిరాలకు హాజరు కావాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు కానున్నట్టు చెప్పారు. ఆసక్తి గలవారు క్రీడల జిల్లా అసోసియేషన్లు, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల వద్ద తమ పేర్లను దరఖాస్తు రూపంలో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

'వేట నిషేధ భృతి రూ.40 వేలు ఇవ్వాలి'

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఇక్కడ కోరారు. ప్రతి మత్స్యకారుడికి రూ. 40వేలు ఇవ్వాలన్నారు. మత్స్యకారుల జీవన పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, ఉపాధి లేక వలసలు పోతున్నారన్నారు. అనకాపల్లి జిల్లాలో ఫార్మా కంపెనీల వ్యర్థాలకు చేపలు చనిపోతుండడంతో వేటకు వెళ్లినా కనీస కూలీ గిట్టుబాటు కావడం లేదన్నారు. మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిందిగా ఆయన కోరారు.

నర్సీపట్నం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం.462/2024/ఎ1 — తేది. 16.04.2025

బహిరంగ వేలం ప్రకటన

నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో ఈ క్రిందనుదహరించిన షాపింగ్ కాంప్లెక్స్ నందు షాపు రూముకు తేది.28.04.2025 సోమవారం మధ్యాహ్నం 03.00 గంటలకు కమిషనరు వారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు వేలం పాట నందు పాల్గొనదలచిన పాటదారులు అందరూ గౌరవ జిల్లా కలెక్టర్, అనకాపల్లి వారు ఆమోదించిన గెజిట్ నోటిఫికేషన్ నెం.07/2025, తేది.24.02.2025 లోని నియమ నిబంధనలకు లోబడి (బద్ధులై) యుండవలెను.

క్ర. నెం.	షాపింగ్ కాంప్లెక్స్	బహిరంగ వేలం నిర్వహించబడు షాపు నెం.	లీజు కాలం	GST టాక్స్	డిపాజిట్టు
1	గ్రంథాలయం	షాపు నెం.4-జనరల్	01.07.2025 నుండి 30.06.2028	వేలం పాట మొత్తంపై 18 శాతం	వేలం డిపాజిట్టు రూ.20,000-00 సాల్వెన్సీ రూ.50,000-00

పూర్తి వివరముల కొరకు ఈ కార్యాలయపు పనిదినములో రెవెన్యూ విభాగం వారిని సంప్రదించగలరు అని తెలియజేయడమైనది.

కమిషనరు, నర్సీపట్నం పురపాలక సంఘం

ఎంపీడీవో దృష్టికి రాజేంద్రపాలెం సమస్యలు


ఎంపీడీవోతో చర్చిస్తున్న జనసేన నేతలు

కొయ్యూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో తాగునీటి సమస్యతో పాటు పారిశుధ్య పరిరక్షణపై చొరవ చూపాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఆ పార్టీ నేతలు కోరారు. బుధవారం ఈ మేరకు ఎంపీడీవోను ప్రసాద్‌ను కలిసి గ్రామంలో సమస్యలపై చర్చించారు. ప్రధానంగా గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని, అల్లూరి పార్కు పరిసరాలు పారిశుధ్యలోపంతో ఉన్నాయని దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి శేషుబాబు, కార్యనిర్వహణ అధ్యక్షుడు సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి అప్పలనర్సయ్య

అరకులోయ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి పాచిపెంట అప్పలనర్సయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీతో పాటు ట్రైబల్ డీఎస్సీ ప్రకటించి గిరిజన నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అరకులోయ ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జీవో 3 పునరుద్ధరించి గిరిజన ప్రాంతంలో యువతకు వందశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే, అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా ఈ హామీని నిలుపుకోలేదని విమర్శించారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నేత పొద్దు బాలదేవ్, సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి భగత్‌రామ్ పాల్గొన్నారు.

చౌడుపల్లి సుబ్రహ్మణ్యస్వామి జాతర రేపు

చింతపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడుపల్లి గ్రామ పంచాయతీలో ఈనెల 19 నుంచి నిర్వహించనున్న సుబ్రహ్మణ్యస్వామి జాతరను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ నేత దేపూరి వెంగళయ్య అన్నారు. బుధవారం స్వామివారి ఆలయంలో జాతర పోస్టర్లను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంగళయ్య మాట్లాడుతూ ఈనెల 22తేదీ వరకు జాతర జరుగుతుందన్నారు.ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు సరమండ తిలక్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు.. ఇటీవల అరకు నియోజకవర్గంలో ఇన్‌చార్జి సీవేరి దొన్నుదొర సమావేశం నిర్వహించినా, మండల కమిటీ, పార్టీ అనుబంధ కమిటీలు, సీనియర్ నాయకులకు కనీసం సమాచారం ఇవ్వలేదని వాపోయారు. పార్టీలో కష్టపడుతున్నవారికి గుర్తింపులేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. ఈవిషయం పార్టీ జిల్లా ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలోని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు అ ప్పారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి టి. ఆనందరావు, నాయకుడు జోగులు, మాజీ సర్పంచ్ సారా దొన్ను, దేముడు, శ్యామ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రవీంద్ర సేవలు అభినందనీయం

చింతపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన ఉపాధ్యాయుడు వాడకాని రవీంద్ర సేవలు అభినందనీయమని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కొనియాడారు. బుధవారం లంబసింగి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈనెల 31న పదవీ విరమణ చేయనున్న రవీంద్రకు ఉపాధ్యాయులు సన్మాన సభను ఏర్పాటు చేశారు. తొలుత రవీంద్ర, అన్నామణి దంపతులకు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 వీబీవీవీ ప్రసాద్, గెమ్మెలి బోడం నాయుడు, పీజీహెచ్‌ఎంలు వీరభద్రరావు, బీఎస్ఎన్ పడాల్, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం ఉగ్రంగి నరసింగరావు, రిటైర్డ్ పీజీహెచ్‌ఎం వాలంగి నారాయణరావు, ఉపాధ్యాయులు కేపీరాజు, శ్రీనివాసరావు, కొయ్యూరు జీసీసీ మేనేజర్ సరమండ విజయ్ కుమార్, టీడీపీ నేత కంటా రమణ పాల్గొన్నారు.

తాజంగి గ్రామ సర్వేయర్ సస్పెన్షన్

చింతపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామ సచివాలయం సర్వేయర్ సాగిన రవికుమార్‌ని కలెక్టర్ దినేశ్‌కుమార్ సస్పెండ్ చేసినట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ పింఛన్లు గ్రామ సర్వేయర్ సకాలంలో పంపిణీ చేయలేదన్నారు. దీంతో నగదును రికవరీ చేసినట్టు చెప్పారు. పింఛన్ పంపిణీ చేయకపోవడంతో కలెక్టర్ శాఖపరమైన విచారణకు ఆదేశించారన్నారు. విచారణ అధికారుల నివేదిక ఆధారంగా సర్వేయర్‌ని సస్పెండ్ చేసినట్టు ఆయన తెలిపారు.

వైభవంగా మారెమ్మ గరగ ఉత్సవం

» అమ్మవారి మాలధారులు

అగ్నిగుండం నుంచి ఆలయ ప్రవేశం

సీలేరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మారెమ్మ అమ్మవారి గరగ అలంకరణ ఉత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఉత్సవాల్లో గరగ అలంకరణ, అగ్నిగుండం ప్రవేశం ముఖ్య ఘట్టం. ఈ కార్యక్రమంలో తొమ్మిది రోజులపాటు మారెమ్మ మాల ధరించి ఉప వాస దీక్షలను పాటించిన సీలేరు, పరిసర గ్రామాలకు చెందిన 78 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొంకరాయికి చెందిన తమిళ పూజారి సుబ్రహ్మణ్యం స్వా మి ఆధ్వ ర్యంలో మధ్యాహ్నం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలనునిర్వహించారు. అనంతరం సాయంత్రం మాలలు ధరించి అగ్నిగుండం తొక్కే భక్తులకు కంకణాలను కట్టారు. గణపతి పూజనిర్వహించి అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న అగ్నిగుండం ప్రాంతంలో అగ్నిదేవునికి పూజలను నిర్వహించారు. అనం తరం ముద్ద కర్పూరంతో ఆ కట్టెల ను వెలిగిం చి , తమిళపూజారి, భక్తులు కలసి సీలేరు జలాశయం వద్దకు చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారి గరగను తయారు చేసిన తర్వాత తొమ్మిదిరోజులు దీక్ష చేపట్టిన భక్తుడు బబులపై అమ్మవారు ఆవహించారు. ఆయన గరనుతలపై ఎత్తుకుని ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన అగ్నిగుం డం వద్దకు చేరుకుని తొలుత అగ్నిగుండం తొక్కుకుంటూ ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం మిగిలిన 78 మంది భక్తులు అగ్నిగుండం మీదుగా ఆలయంలోకి ప్రవేశించారు. కొం తమంది నోటికి శూలాలను గుచ్చుకుని తమ భక్తి భావాన్ని చాటారు.

అగ్నిగుండం తొక్కుతున్నంతసేపు అమ్మవారి నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి చూసేందుకు వచ్చి వేలాది మంది భక్తులు అ మ్మవారిని దర్శించుకున్నారు. అగ్నిగుండం కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఎత్తున బాణ సంచాను కాల్చారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్ బలగాను జెన్‌కో సెక్యూరిటీని జీకేవీధి సీఐ వరప్రసాద్, సీలేరు ఎస్ఐ ర వీంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమ్మవారి గరగను జలాశయం వద్ద తయారు చేస్తున్న తమిళ పూజారి సుబ్రహ్మణ్య స్వామి


గరగతో అగ్నిగుండం తొక్కుతూ ఆలయ ప్రవేశం చేస్తున్న భక్తుడు బబుల

ఘనంగా యోగా గురువుకు సన్మానం


పతంజలి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో ప్రభుత్వం చేపట్టిన మహా సూర్య నమస్కారాలతో ప్రపంచ రికార్డు సొంతం చేసుకొనేలా కృషి చేసిన యోగా గురువు పతాంజలి శ్రీనివాస్‌ను స్థానిక మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బుధవారం ఆలయానికి వచ్చిన శ్రీనివాస్ ముందుగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి సుబ్బారావు మాట్లాడుతూ పాడేరు డివిజన్ పరిధిలోని 5 మండలాలకు చెందిన వివిధ గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన 21,850 విద్యార్థులతో అరకులోయ ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో 108 సూర్యనమస్కారాల ప్రదర్శన శ్రీనివాస్ కృషికి నిదర్శనమన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేశ్, సుబ్రహ్మణ్యం, కొణతాల ప్రశాంత్, కేజే రాణి, సత్యనారాయణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక శిబిరం

పాడేరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాడేరులో 17వ తేదీ గురువారం దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో జె.తేజరతన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగుల కృత్రిమ అవయువాల తయారీ సంస్థ (ఏఎల్ఐఎంసీవో) హైదరాబాద్ వారి పర్యవేక్షణలో స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో అసెస్మెంట్ క్యాంప్ (వికలత్వం అంచనా శిబిరం) ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట మండలాలలకు చెందిన దివ్యాంగులు, పరికరాలు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లుగసరిపుట్టు గ్రామానికి రహదారి నిర్మించాలి


ఆందోళన చేపడుతున్న గ్రామస్థులు

పెదబయలు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీ పరిధి లుగసరిపుట్టు గ్రామానికి పక్కా రహదారితో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ స్థులు ఆందోళన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వణుగూరి బాబూజీ, శేఖర్ మా ట్లాడుతూ.. ప్రధానంగా సరైన రోడ్డు సౌకర్యం లేక అత్యవసరాల్లో అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరికైనా ఆనారోగ్యంతో మంచాన పడితే అంబులెన్స్ గ్రామానికి వచ్చే పరిస్థితిలేదని వాపోయారు. ప్రతీ నెలా రేషన్ బియ్యం కోసం గ్రామం నుంచి కుంతుర్లకు వెళ్లి మోసుకు వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రాంబాబు, ప్రసాద్, సత్యబాబు, భాస్కర్, రాజందొర, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి


గర్భిణుల సీమంతాల్లో సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ అన్నారు. బుధవారం రాజుపాకలు సెక్టార్ పరిధి లోతుగెడ్డ జంక్షన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమం జరిగింది. తొలుత గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణలో భాగంగా గర్భందాల్చిన రోజు నుంచి శిశువుకి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్తల పర్యవేక్షణ ఉంటుందన్నారు. గర్భిణులంతా ఆస్పత్రిలో ప్రసవం పొందడం, శిశువులకు తల్లి ముర్రు పాలు తాగించాలన్నారు. శిశువుకి టీకాలు వేయించాలన్నారు. పోషణ ట్రాకర్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి, సూపర్‌వైజర్లు గౌహరున్నీష, కె. విజయకుమారి, ఎస్.గౌరి, పి. అప్పలనర్స పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్‌లో మండలాల్లో ఫీడర్ల మరమ్మతులు నేపథ్యంలో 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు హెడ్‌క్వార్టర్ పరిధిలోని కలెక్టర్ బంగ్లా, తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ అం తరాయం ఉంటుందన్నారు. జి.మాడుగుల సబ్‌స్టేషన్ పరిధి ఫీడర్ మరమ్మతులు నేపథ్యంలో జి.మాడుగుల, పాత జి.మాడుగుల, జి.మాడుగుల కొత్తూరు గ్రామాలకు, కొయ్యూరు మండలంలోని కేడీపేట సబ్‌స్టేషన్‌లోని నాగాపురం ఫీడర్ పరిధిలో బంగారంపేట, పరదేశీపాకలు, గుమ్మలపాలెం, రాజుపేట, బలుసుకూరపాకలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు


అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రామ్మోహనరావు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ తో సాగుతో అధికలాభాలు పొందవచ్చని జిల్లా సేంద్రి వ్యవసాయ మేనేజర్ రామోహ్మన్‌రావు అన్నారు. మండలంలోని ఎనుగురాయి పంచాయతీ కొండపడలో గిరిజన రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ముందుగా నవధాన్యాలను రైతులతో పొలంలోని చల్లించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా నవధాన్యాలు ఉపయోగపడతాయని వివరించారు. దొడ్డిపుట్టులో పర్యటించి.. పురుగు మందు వాడకం, తదితర వాటిపై రైతులకు వివరించారు. అదనపు జిల్లా సేంద్రియ వ్యవసాయ మేనేజర్ భాస్కరరావు, ఏవో శ్రీనివాసబాబు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

పాడేరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏపీ) ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 50 సమ్మర్ శిక్షణ కేం ద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా ప్రాధికార సంస్థ అధికారి ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. 8 నుంచి 14 ఏళ్ల వయస్సు గల బాల బాలికలకు వివిధ క్రీడాంశాలలో శిక్షణ అందించేందుకు జిల్లాలోని క్రీడా సంఘాల ప్రతినిధులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శుల నుంచి ప్రతిపాదనలను పంపించాలన్నారు. ఆ సక్తిగల వారు ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పెదబొడ్డేపల్లిలో దొంగలు హల్‌చల్

... 5వ పేజీ తరువాయి

చోరీ జరిగినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదే వీధిలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బత్తిన సత్యనారాయణ నివాసం వుంటున్నారు. ప్రస్తుతం రాంబిల్లి మండలంలో ఎన్ఏవోబీలో పనిచేస్తున్నారు. వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెళుతుంటారు. ఆయన భార్య భవానీ శనివారం అత్త వారి ఊరైన కోటవురట్ల మండలం పందూరులో పండక్కి వెళ్లారు. బుధవారం ఉదయం తలుపులు తెరిచి ఉండడాన్ని ఎదురింటావిడ గమనించి భవానీకి సమాచారం ఇచ్చారు. ఆమెకు దగ్గర బంధువు నాగేశ్వరరావు 100కు ఫిర్యాదు చేయగా. పోలీసులు వచ్చి విచారణ చేశారు. రెండున్నర తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు బాధితులు చెప్పారు. పెదబొడ్డేపల్లి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న రామ్‌నగర్ కాలనీలో వైజాగ్ ఎయిర్ పోర్టులో సెక్యూరిటీ విభాగంలో ఎస్ఐ కేడర్ అధికారిగా పని చేస్తున్న అడిగర్ల శ్రీరామమూర్తి నివాసం వుంటున్నారు. అయితే ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో వుంటూ వారానికి ఒక రోజు భార్యాభర్తలు ఇక్కడకు వచ్చి ఇల్లు శుభ్రం చేసుకొని వెళుతుంటారు. ఇది గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న శ్రీరామమూర్తి కుమారుడు ప్రసాద్.. ఇంట్లో దుస్తులు చెల్లాచెదురుగా ఉండడాన్ని సీసీ కెమెరాలకు అనుసంధానం చేసిన సెల్ ఫోన్ ద్వారా చూసి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి 10 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. క్లూస్ టీమ్‌లు వేలి ముద్రలు సేకరించాయి. థెరెసా కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రామకృష్ణ ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఠారెత్తిస్తున్న ఎండలు... పాడేరులో 35.5 డిగ్రీలు

పాడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):మన్యంలో ఎండలు తీవ్రప్రభావం చూపుతుండడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే ఉదయం వేళల్లో పొగమంచు, చలి ప్రభావమున్నా,ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పుకానరావడం లేదు. పాడేరులోబుధవారం 35.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా... కొయ్యూరులో 35.3, హుకుంపేటలో 32.0, ముంచంగిపుట్టులో 31.8, చింతపల్లిలో 30.1, జీకేవీధిలో 29.0, జి.మాడుగులలో 28.1, అనంతగిరిలో 27.6, అరకులోయలో 24.0, డుంబ్రిగుడలో22.3,పెదబయలులో 21.2డిగ్రీలఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దోమల నివారణ మందు పిచికారీ

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని స్ప్రెయింగ్ మలేరియా పిచికారీని బుధవారం వైద్యాధికారి రమేశ్ ప్రారంభించారు.. అనంతరం దోమల నియంత్రణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వాడక నీరు నిల్వలేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ శివశంకర్, వైద్య సిబ్బంది చౌడప్పడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం, క్రికెట్ స్టేడియంకు స్థలాలు కేటాయించండి

» కలెక్టర్‌ను కోరిన జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్టీసీ రిజియన్ చైర్మన్ దొన్నుదొర

పాడేరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకులోయ ప్రాంతాల్లో వెంకటేశ్వర స్వామి ఆలయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు అవసరమైన స్థలాలను కేటాయించాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. గిరిజన ప్రాంతంలో ఆధ్యాత్మిక సేవాభావం పెంపొందించేందుకు శ్రీవారి ఆలయ నిర్మాణానికి 15 ఎకరాలు, క్రీడా కారులను ప్రోత్సాహించేందుకు స్టేడియం కోసం 10 ఎకరాల స్థలాలను కేటాయించారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాం తంలో అవసరమైనవి మంజూరుకు ముందుకు వస్తుందన్నారు. ఈక్రమంలో స్థలాలు సమకూరితే నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగ స్వామి, టి.సత్యనారాయణ, రాంబాబు, ప్రసాద్, మురళీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో టీడీపీ బలోపేతం

» విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర


మాట్లాడుతున్న ఆర్టీసీ రిజియన్ చైర్మన్ దొన్నుదొర

డుంబ్రిగుడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలు తెలుగుదేశం పార్టీ పురోగతికి తోడ్పాటునిస్తాయని ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర అన్నారు. మండలంలోని కురిడి పంచాయతీ కేంద్రంలో టీడీపీ గ్రామ, బూత్ కమిటీల సంస్థగత ఎన్నికలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ ఎన్నికలో పాల్గొన్న దొన్నుదొర మాట్లాడారు. కూటమి అధికారంలో వచ్చి ఏడాదిలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధిలో పయనిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు గిరిజన ప్రాంత ప్రజలు అంటే గౌరవం ఉందన్నారు. ఈ క్రమంలో శాశ్వత రహదారులతోపాటు మౌలిక సౌకర్యాలు, సంక్షే పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆనంద్, వెంకటరావు, బీమన్న, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి నష్టపరిహారం చెల్లించండి

డుంబ్రిగుడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెదపాడు గ్రామంలోని మంగళవారం పిడుగుపాటుకు గురైన నాలుగు దుక్కి పశువులు మృత్యువాత చెందిన బాధిత రైతుకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యంతో వ్యవసాయనికి దన్నుగా నిలిచే దుక్కి పశువులు పిడుగుపాటు రూపంలో మృతి చెందడంతో బాధితుడు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితుడిని ఆదుకోవాలని ఆయన కోరారు.

జడ్పీ పనులకు మోకాలడ్డు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. దీంతో సభ్యులు శాంతించారు. సమావేశం ప్రారంభంకాగానే కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు పాటించనందునే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అన్ని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దారు, ఎస్ఐ, ఎంపీడీవోల నేతృత్వంలోని కమిటీ ప్రతి నెల తనిఖీచేస్తే భవిష్యత్తులో ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. బాణసంచా ప్రమాదంతోపాటు ఫార్మా, ఇతర కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు చెల్లించే పరిహారంలో వ్యత్యాసం వుంటున్నదని, దీంతో తగిన నష్టపరిహారం కోసం ఫార్మా కంపెనీల వద్ద బాధిత కుటుంబాలు ధర్నాలు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు ఒకే విధమైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం ఒక విధానం రూపొందించాలని కోరుతూ జడ్పీ తీర్మానం చేయాలని కోరారు. ఇందుకు సమావేశం ఆమోదించింది. పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు మాట్లాడుతూ, పరవాడ ఫార్మాసిటీలోని పలు కంపెనీల నుంచి విడుదలయ్యే విషవాయువులతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని నివారించడానికి ఆయా కంపెనీలు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

వైద్య, ఆరోగ్య శాఖపైలో జరిగిన చర్చలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఎక్కువగా ఉందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో గైనిక్, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వైద్యులను తక్షణమే నియమించాలని, అన్ని సీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే బండారుతోపాటు కోటవురట్ల, చింతపల్లి, పెదబయలు జడ్పీటీసీ సభ్యులు సిద్ధాబత్తుల ఉమాదేవి, పోతుల బాలయ్య, బొంజిబాబు కోరారు. అనంతగిరి మండలంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఎస్.కోటలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కాకుండా విజయనగరం తీసుకెళుతున్నారని, దీనివల్ల మెరుగైన వైద్యం అందడంలేదని జడ్పీటీసీ సభ్యుడు డి. గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా జేసీ అభిషేక్ గౌడ స్పందిస్తూ.. సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనకాపల్లి జిల్లాలో మందుల దుకాణాలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేదని, కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నారని, దీనిపై ఫిర్యాదుచేసినా ఎవరు పట్టించుకోవడంలేదని బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆరోపించారు. ఎమ్మెల్యే బండారు జోక్యంచేసుకుని... ఉమ్మడి జిల్లాలో అన్ని మందుల దుకాణాలను తనిఖీచేసి వచ్చే సమావేశంలో ఒక నివేదిక అందజేయాలని కోరారు.

అంతకుముందు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు శివానంద్ మాట్లాడుతూ, కేజీహెచ్‌లో వారం రోజులపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మార్చురీ గది వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో వడదెబ్బకు గురైన వారికి చికిత్స అందించడం కోసం ఆరు బెడ్లతో ఉన్న ఏసీ గదిని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా ఓపీ కౌంట్లు ఓపెన్ చేశామని చెప్పారు.

జలజీవన్ మిషన్ పనులపై గోప్యంత ఎందుకు?

జిల్లాలో జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులపై గోప్యత ఎందుకని, కనీసం సర్పంచ్‌కు కూడా సమాచారం ఇవ్వడంలేదని చైర్‌పర్సన్ సుభద్ర మండిపడ్డారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు సర్పంచ్‌కు చెప్పకపోతే ఎలా అని అధికారులను నిలదీశారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ పనుల్లో లోపాలు ఉన్నాయని, చాలాచోట్ల నీరు రావడంలేదని అన్నారు. దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చౌదరి హామీ ఇచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం నీటి పథకాలు, బోర్లకు మరమ్మతులు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అరకులోయ ఎంపీ తనూజరాణి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, 'సామాజిక' కార్పొరేషన్ల చైర్మన్లు పీవీజీ. కుమార్, మళ్ల సురేంద్ర, జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

దృష్టి పెట్టాలన్నారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు మాట్లాడుతూ సామాన్య భక్తులకు సత్వరం దర్శనం లభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, దేవదాయశాఖ కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, సింహాచలం ఇన్‌చార్జి ఈవో సుబ్బారావు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ వై.తారకేశ్వర రావు అన్నారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు రిపబ్లిక్ డే సందర్భంగా బుధవారం ప్రోత్సాహక సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెండేళ్లుగా పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ ఏఎస్ఐ ఆళ్ల నూకరాజు ఎన్‌సీసీ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని చెప్పారు. వీటి ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత చెడు వ్యసనాల దారి పట్టకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వరలక్ష్మి, ఏఎస్ఐ నూకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

▸▸ ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న స్పష్టం చేశారు. మండలంలో ఎల్‌బిపి.అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తొమ్మిది రకాల జాతులు, 30 రకాల విత్తనాలతో బీఎండీఎస్‌పి కిట్లు తయారుచేయించి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాలకు ముందుగా ఎకరాకు 12 కిలోల చొప్పున 45 రోజుల ముందుగానే రైతులు పొలంలో విత్తనాలు వేయడానికి వేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఎన్‌ఎండీఎస్ పద్ధతి 265 రోజులు భూమిని కప్పబడి ఉంచే నిరంతరాయ సాగుపద్ధతికి శ్రీకారం చుడుతుందన్నారు. వివిధ వేర్లు భూమిలో ఆశ్రయించి పంటలకు ఉపయోగపడే సంతతిని అభివృద్ధి పరుస్తాయని, తద్వారా పంటలకు కావాల్సిన పోషకాలు అందుబాటులోకి తీసుకువచ్చి మొక్కలు వేరువ్యవస్థ గ్రహించేలా చేస్తాయని ఆయన చెప్పారు. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా ఉపయోగపడతాయన్నారు. అలాగే నేల కోతకు గురికాదని, జీవ వైవిధ్యం పెరిగి సేంద్రియ శాతం పెరుగుతుందని చెప్పారు. ప్రధాన పంటల్లో రసాయనిక ఎరువులు, కలుషం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి భాస్కరరావు, ఎల్‌బిపి.అగ్రహారం, కొండపాలెం, బంగారుమెట్ట సర్పంచులు శ్రీనివాసరావు, భవానీ వెంకటసోమునాయుడు, బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు ఇల్లపు జగ్గారావు, ఎం.మోహన్‌రావు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, రైతులు, పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం 16బిపిటి 1

సిమెంట్ బస్తాల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

నాతవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంంలోని వల్సంపేటలో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ఉపయోగించే 1500 సిమెంట్ బస్తాలు దుర్వినియోగమయ్యాయని, దీనిపై విచారణ చేపట్టాలని తాండవ నీటి సంఘం అధ్యక్షుడు మిడతాన సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. 2020లో వల్సంపేటలో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులతో పునాదుల వరకు నిర్మాణ పనులు చేశారని, ప్రభుత్వం వచ్చిన 1500 సిమెంట్ బస్తాలను మాత్రం దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పీఆర్ డీఈ ఈశ్వరరావును వివరణ కోరగా సిమెంట్ బస్తాలను రికవరీ చేస్తామని తెలిపారు.

కేంద్ర ప్లానింగ్ కమిషన్ సభ్యుల సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు వెంకటగిరిబాబు



గొలుగొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర 16వ ప్లానింగ్ కమిషన్ సభ్యుల సమావేశానికి గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబును ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నెల 17వ తేదీన తిరుపతిలో జరుగనున్న రాష్ట్రంలోని మూడు విభాగాల గ్రామీణ ప్రజా ప్రతినిధుల్లో సమావేశంలో పాల్గొనడానికి రాష్ట్రంలోని తొమ్మిది మంది సర్పంచులు, ఐదురుగు ఎంపీపీలు, నలుగురు జడ్పీటీసీ సభ్యులను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎంపిక చేశారు. ఇందులో భాగంగా జడ్పీటీసీ సభ్యుడు వెంకటగిరిబాబును ఎంపిక చేయడంతో తిరుపతి బయలుదేరారు. గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థలు ఎదురుకుంటున్న ఇబ్బందులు, నిధుల అవసరాలు, తదితర అంశాలు తెలుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

బాణసంచా తయారీ కేంద్రంలో డీఎస్పీ తనిఖీలు



మందుగుండు సామగ్రి నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మాకవరపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో భీమబోయిన పాలెం గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బాణసంచా నిర్వహిస్తున్న కేంద్రానికి అనుమతులు ఉన్నాయా, లేదానని నిర్వాహకుడ్ని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. 2026 వరకు అనుమతులు ఉన్నాయని చెప్పగా, అయినప్పటికీ మందుగుండు తయారీ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. పరిమితి మించి మందుగుండు సామగ్రి ఉందరాదన్నరు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

మేట్ తొలగింపుపై ఉపాధి కూలీల ఆందోళన



కార్యాలయం ఆవరణలో ఎంపీడీవోను నిలదీస్తున్న ఉపాధి కూలీలు

చీడికాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలపూడి గ్రామంలో పాతమేటు చంద్రదేవిని తొలగించడంపై ఉపాధి కూలీలు మండిపడ్డారు. ఎవరి అభిప్రాయం తీసుకుని మేట్ మార్చారని అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ కురచా జయమ్మతో కలిసి బైలపూడి ఉపాధి కూలీలు గాడి కన్నతల్లి, లక్ష్మి, మోసూరి లక్ష్మి, మహలక్ష్మి, గాడి సత్యనారాయణ, జె.అప్పారావు మాట్లాడుతూ పాత మేట్ చంద్రదేవి ఆధ్వర్యంలో సక్రమంగా పనులు చేస్తున్న తరుణంలో, ఆమెను తొలగించి కొత్తగా గాడి వరలక్ష్మిని నియమించామని వీఆర్పీ సత్యనారాయణ చెప్పడం సరికాదన్నారు. ఎవరి సంతకాలతో కొత్తమేట్‌ని నియమించారని అధికారులను నిలదీశారు. పాతమేట్ చంద్రదేవిని కొనసాగించకపోతే ఉపాధి పనులు బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం 38 మంది సంతకాలతో చంద్రదేవిని కొనసాగించాలని ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీడీవో హేమసుందర్రావు స్పందిస్తూ ఏపీవో గంగునాయుడు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరావు సమావేశం నిర్వహిస్తామని, ఉపాధి వేతనదారులు నియమించే వారిని కొనసాగిస్తామని చెప్పారు. అంతవరకూ ఎవరూ పనులు మానవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లవిల్లి రాజబాబు, స్వామినాయుడు, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కుక్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్దాది జిల్లా పరిషత్ పాఠశాల బాలికల వసతిగృహంలో వంట సిబ్బంది నియామకానికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. హెడ్‌కుక్ పోసు కోసం 14 మంది, అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం 21 మంది వచ్చారు. వీరికి ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో-1, 2 బొంజుబాబు, కాశీవిశ్వేశ్వరరావు ఇంటర్వ్యూ చేశారు.

'టాటా' పీహెచ్‌డీకి లక్ష్మీప్రహర్ష ఎంపిక



పాయకరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండ మెంటల్ రీసెర్చ్ పీహెచ్‌డీకి పాయకరావుపేటకు చెందిన కొసిరెడ్డి లక్ష్మీప్రహర్ష ఎంపికైంది. గతేడాది డిసెంబరు 8న జాతీయ స్థాయిలో నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో లక్ష్మీప్రహర్ష ప్రథమ శ్రేణి సాధించి జాతీయ స్థాయిలో ఇంటర్వ్యూలకు ఎంపికైంది. మార్చి 5, 6 తేదీల్లో జరిగిన సెకండ్ లెవెల్ ఇంటర్వ్యూల్లో 36 మంది ఎంపిక కాగా, ఏపీ నుంచి ప్రహర్ష డిపార్టుమెంట్ ఆఫ్ ఎస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేయడానికి ఎంపికైంది. ఫిజిక్స్ విభాగంలో రీసెర్చ్ చేసి సైంటిస్ట్‌గా స్థిరపడాలని తన ఆకాంక్ష అని ఈ సందర్భంగా ప్రహర్ష తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు



చోడవరంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చోడవరం మండల కేంద్రంలోని కోదండరామ అపార్ట్‌మెంట్స్‌లో వంట గ్యాస్ ప్రమాదాలపై ఏ విధంగా వ్యవహరించాలని అనే అంశంపై అగ్నిమాపక సిబ్బంది, ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ వాడే సందర్భంలో ప్రమాదం తలెత్తినపుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, సిలిండర్లు అమర్చే క్రమంలో పాటించాల్సిన కనీస భద్రతాపరమైన చర్యలను మహిళలకు అగ్నిమాపక శాఖ సిబ్బంది వివరించారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం: స్థానిక శ్రీకన్య సినీ కాంప్లెక్స్‌లో అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం అగ్ని ప్రమాదాలలపై అవగాహన నిర్వహించారు. అగ్ని మాపక కేంద్రం అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాదాలు జరగినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలను తెలియజేశారు. అనంతరం కరపత్రాలతో వారు ప్రచారం నిర్వహించారు.

మాడుగులలో...



మాడుగులలో ప్రమాదాలపై అవగాహన

మాడుగుల రూరల్: మండలంలోని ఘాట్ రోడ్డు జంక్షన్‌లో బుధవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్ ఆఫీసర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో వంటగ్యాస్ వినియోగించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రిఫ్రిజిరేటర్లు, ఏసీలు వినియోగించేటప్పుడు అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్త పడాలని ఆయన సూచించారు. గ్యాస్ సిలిండరు నుంచి మంటలు వ్యాపిస్తే ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బోగేశ్వరరావు, వర్మ, మూర్తి, వరహాలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వీఆర్పీల నిరసన

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వీఆర్పీలు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు 19 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకొని తమకు పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలో ఎన్నో ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నామని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీఆర్‌పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో సీతామహాలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ ఏఫ్‌టీఏలు ఇచ్చి పూర్తి స్థాయి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. అర్హులందరినీ కంప్యూటర్ ఆపరేటర్లుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఈ నెల 28వ తేదీన విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని వారు స్పష్టం చేశారు.

రాయపురాజుపేటలో భూముల రీ సర్వే



రాయపురాజుపేటలో భూముల రీ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

చోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేట పంచాయతీలో బుధవారం భూముల రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రీ సర్వే అనంతరం రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామునాయుడు సర్వే అధికారి బి.వెంకన్న, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ కోసం ఆన్‌లైన్ శిక్షణ

నర్సీపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు మెగా డీఎస్సీ కోసం ప్రభుత్వం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తుందని ఏబీసీడబ్ల్యూవో వి.గోపీనాథరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఇందుకు అర్హులని తెలిపారు. తమ సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కుల, ఆదాయం, స్థానికత ధ్రువపత్రాలు, మార్కులు నకలు దరఖాస్తుతో జతపరచాలని సూచించారు. దరఖాస్తులు మునిసిపల్ కార్యాలయం పక్కన ఉన్న వెనకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

దేవరాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో ఎం.వి.సువర్ణ రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి హాజరవుతారని చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు అందించే వినతులు ఎమ్మెల్యే స్వీకరిస్తారన్నారు. మండల ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాకవరపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామంతిపురం గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వికాస్ సతీశ్ హనుమాన్ విగ్రహాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్, వైసీపీ నేతలు రుత్తల యర్రాపాత్రుడు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, సర్పంచ్ బోడ్డు గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.

రాజాంలో పిచ్చి కుక్క స్వైరవిహారం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం గ్రామంలో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. మరిసా అప్పలకొండ అనే వృద్ధురాలు ఇంటిలో ఉండగా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వృద్ధురాలి కేకలు వేయడంతో ఉప సర్పంచ్ కంఠంరెడ్డి గోవింద, గ్రామస్థులు కర్రలతో కొట్టడంతో కుక్క పారిపోయింది. వెంటనే వృద్ధురాలిని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. ప్రథమ చికిత్స అందించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి వైద్యులు తరలించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రోలుగుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో నాగేశ్వరావు తెలిపారు. నిరుపేద ఎస్సీల స్వయం ఉపాధి కోసం రాయితీపై బ్యాంకు లింకేజీ రుణాలను ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. మండల కమిటీ స్థాయిలో ఎంపికలు ఉంటాయని తెలిపారు.

వేణుగోపాలస్వామికి మాజీ డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు

దేవరాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి గొల్లపేటలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి ఒకరి మృతి

చోడవరం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంధ్రా బ్యాంకు సమీపంలో మురుగు కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లికి చెందిన కడిమి ఏసు(38) చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను మురుగు కాలువలో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టు మార్టానికి తరలించారు. మద్యం మత్తులో కాలువలో పడి చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కాగా గత నెలలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కూడా ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందాడు.

భారీ వర్షం... జనం ఉపశమనం



చీడికాడలో కురుస్తున్న వాన

చోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం భానుడు ప్రతాపానికి అల్లాడిన ప్రజలు, మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం చల్లపడ్డంతో ఉపశమనం పొందారు. ప్రస్తుత ఎండాకాలంలో రోజూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బుధవారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడి ప్రజలు సేదతీరారు. చోడవరంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో మోస్తర వర్షం పడింది. ఉదయం నుంచి ఎండతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడి వర్షం పడడంతో ఊరట చెందారు.

దేవరాపల్లిలో...



దేవరాపల్లి ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

దేవరాపల్లి: మండలంలో గాలులతో వర్షం పడింది. ఈ వర్షంతో వాతావరణం ఒక్క సారిగా మారిపోయింది. బుధవారం ఉదయం ఎండకు ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షానికి ఊరట చెందారు. ఈ వర్షం నువ్వు పంట, కూరగాయల పంటలకు ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, భారీ వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. చినుకు పడితే విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాయగా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ వర్షపునీటి ప్రవాహంతో నిండిపోయాయి. అలాగే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

చీడికాడలో...

చీడికాడ: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన వాన, ఆరు గంటల వరకూ పడింది. రెండు గంటల పాటు కురిసిన మోస్తరు వర్షానికి వాతావరణం చల్లబడిపోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మోదకొండమ్మ వార్షికోత్సవం



బంగారమ్మపాలెంలో అన్నసమారాధనకు హాజరైన భక్తులు

చోడవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు బంగారమ్మపాలెంలో మంగళవారం మోదకొండమ్మ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మోదకొండమ్మ ఆలయం ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.